# ఇరుగూ-పొరుగూ

మొన్న క్రిస్మస్ రోజున, శ్రీమతి ఒక అరడజను 'మాంగో పై' లు చేసింది. ఇటు పక్కింటి బాబీ సూసన్‌లకి, అటు పక్కింటి గ్రెగ్ లీసాలకీ, ఎదురింటి ఎడ్డీ మోనికాలకీ, కెన్ కేథీకీ ఇవ్వటానికి వెళ్ళాను. నావెనక అప్పుడే ఇండియానించీ చదువుకోటానికి అమెరికా వచ్చిన మా స్నేహితుడి కొడుకు సుందర్ కూడా వున్నాడు.

కాలింగ్ బెల్ కొట్టగానే, తలుపుకి వున్న చిన్న చిల్లిలోనించీ చూస్తూ 'ఎవరూ' అన్నది సూసన్.

'నేనే. మీ పక్కింటాయన్ని. ఫలానా..' అంటుండగా తలుపు తీసింది.

'మెర్రీ క్రిస్మస్. మా ఆవిడ మీకోసం చేసింది.. మాంగో పై' అని అది అందించాను. షేక్‌హేండ్ ఇచ్చి 'థాంక్స్! మెర్రీ క్రిస్మస్.. ఇట్ ఈజ్ నైస్ ఆఫ్ యు టు గెట్ దిస్. థాంక్స్ టు యువర్ వైఫ్ టూ... ' అంది నవ్వుతూ.

మేము వెనక్కి తిరగగానే తలుపు వేసేసుకుంది.

'అదేమిటి లోపలికి రమ్మని అనలేదేం. తలుపు దగ్గరే థాంక్స్ చెప్పేసి వెనక్కి పంపించేసింది' అన్నాడు సుందర్.

నేను నవ్వి 'ఇక్కడంతే. కాజువల్‌గా వెళ్ళినప్పుడు మనం వాళ్ళింటికి వెళ్ళినా వాళ్ళు మనింటికి వచ్చినా అంతే. ఫార్మల్ ఇన్విటేషన్ మీద వెడితే అది వేరే సంగతి..' అన్నాను.

సుందర్‌కి అది కొంత వింతగా వున్నట్టుంది. మనం పై తీసుకువెళ్ళినా ఒట్టి థాంక్స్‌తో, లోపలికి పిలవకుండా పంపించేసిందని ఇంకా గొణుగుతూనే వున్నాడు. అదే గుంటూరులో దీపావళికి పక్కింటి పరంధామయ్యగారికి లడ్డూలు ఇస్తే, లోపలికి పిలిచి కూర్చోబెట్టి కాఫీ ఇచ్చి పంపించరూ అనుకుంటున్నట్టున్నాడు కూడాను.

అవతలిపక్కన ఇంట్లో బెల్ కొట్టగానే గ్రెగ్ వచ్చాడు బయటికి. అతను మా ఎదురుగానే పైలో వేలు పెట్టి కొంత నోట్లో పెట్టుకుని, 'నేనిదే మొదటిసారి మాంగో

పై తినటం. చాల బాగుంది. నీకు వీలున్నప్పుడు ఇది ఎలా చేయాలో చెబుతావా... నేను ట్రైయ్ చేస్తాను..' అన్నాడు. అంతేకాదు వెనకనే వున్న లీసాకి చెబుతున్నాడు చాల బాగుంది కదూ.. అని. లీసా ఆ రోజు ప్రొద్దున్నే వచ్చి లెమన్ కేక్ ఇచ్చి వెళ్ళింది. అందుకే లీసాతో అన్నాను. నువ్విచ్చిన లెమన్ కేక్ చాల బాగుంది అని.

ఎదురింటి కేథీ తలుపు తీసి నేను మెర్రీ క్రిస్మస్ అని పై ఇవ్వగానే, నన్ను కావలించుకుని 'మెర్రీ క్రిస్మస్ టు ఆల్ ఆఫ్ యు' అంది. 'నువ్వు పై తీసుకు రావాల్సిన అవసరమేంలేదు. అయినా తెచ్చావు. థాంక్స్' అని తలుపు వేసేసుకుంది.

ఎదురింట్లో ఎడ్డీ కానీ, మోనికా కానీ వున్నట్టు లేరు. వాళ్ళ పదిహేనేళ్ళ అమ్మాయి తలుపు తీసి, 'మా అమ్మా నాన్నా ఇంట్లో లేరు. వాళ్ళకి చెబుతాను...' అని పై తీసుకుని థాంక్స్ చెప్పి మా ముందే తలుపు వేసేసుకుంది.

సుందర్ అంటున్నాడు, వీళ్ళ పద్ధతేమీ నచ్చలేదు, మర్యాద తెలీదని.

'లేదు సుందర్! ఇందాకే చెప్పానుగా అమెరికన్ పద్ధతే అంత. మర్యాద లేకపోవటం కాదు' అన్నాను.

ఆ సాయంత్రం ఒక గంట వ్యవధిలో ఆ నలుగురూ వచ్చి తలుపు దగ్గరే నుంచుని, చాకొలెట్ చిప్ కుక్కీలు, కేకులూ ఇచ్చి, లోపలికి రమ్మన్నా రాకుండా వెళ్ళిపోవటం చూశాక కానీ సుందర్‌కి ఆ పద్ధతేమిటో పూర్తిగా అర్థం కాలేదు.

'అమెరికన్స్ పైకి చాల కలుపుగోలుగా కనిపిస్తారు కానీ మరీ ఫార్మల్ మనుష్యులు అనిపిస్తున్నది నాకు' అన్నాడు సుందర్.

నేను చిన్నగా నవ్వి అన్నాను 'అవును. కాదు. వీళ్ళల్లో ఆరెండు లక్షణాలూ పుష్కలంగా కనిపిస్తాయి. బ్రిటిష్ సంస్కృతిలోలా మిష్టర్ అనీ, మిస్ అనీ పిలవనక్ఖర్లేదు. వాళ్ళూ మనల్ని అలా పిలవరు. ఆఫీసులో బాస్ అయినా కూడా అంతే. పేరు పెట్టి పిలిస్తే చాలు. మొట్టమొదటిసారి కలిసినప్పుడు కూడా అంతే. ఎన్నాళ్ళనించో పరిచయం వున్నవాళ్ళలా పేరుపెట్టి చనువుగా మాట్లాడతారు. అలాఅని ఫార్మాలిటీస్‌ని వదలరు. పార్టీకి రమ్మని ఆహ్వానం పంపిస్తారు. ఈమధ్య ఆహ్వానాలు ఈమైల్లో కూడా వస్తున్నాయనుకో. మనం పార్టీకి వచ్చేదీ లేనిదీ ఫలానా తేదీలోగా చెప్పమంటారు. మీరిద్దరే రండి పిల్లలు వద్దు. వాళ్ళకి బేబి సిట్టర్ని మాట్లాడుకుంటారనే ముందుగా చెబుతున్నాం అని కూడా దాంట్లో వ్రాస్తారు. పార్టీ కూడా సాయంత్రం ఏడు గంటలకి మొదలయి తొమ్మిదిన్నరకల్లా అయిపోతుంది అని వ్రాస్తారు. ఏడూ పదికి వెడితే 'ఆలస్యం అయిందేం' అని అడిగినా అడగవచ్చు. తొమ్మిదిన్నర అంటే తొమ్మిదిన్నరకి అందరూ శెలవు తీసుకుంటారు'

'మరీ అంత మర మనుషుల్లా వుంటే ఎలా?' అడిగాడు సుందర్.

'మొదట్లో మాకూ నువ్వనుకుంటున్నట్టే అనిపించేది కానీ కొంచెం ఆలోచిస్తే అదే మంచి పద్ధతి అనిపిస్తుంది మాకు. మనపార్టీల్లో ఏడింటికి అంటే ఏడున్నర నించీ తొమ్మిదిదాకా వస్తూనే వుంటారు. అందరికీ ఎనిమిదిన్నరకే భోజనాలు పెట్టినా ఆలస్యంగా రాబోయే అతిథి దేవుళ్ళకోసం తను తినకుండా కూర్చుంటాడు గృహస్తు. ఏ తొమ్మిదిన్నరకో ఫోన్ చేస్తే, ఇవాళ రావటం లేదండీ అని ఏదో కుంటి సాకు

చెబుతారు. అందరూ ఇంటికి వెళ్ళబోయే సమయంలో హోస్టుగారు ఒక పక్కన నుంచుని ఆకలి మీద గబగబా తినేస్తుంటాడు' అన్నాను.

'అమెరికాలో పాతికేళ్ళు వుండేసరికీ మీకు అలవాటు అయిపోయినట్టుంది. అంతేకాదు. ఇందాక మనం పై ఇచ్చామని వాళ్ళు వెంటనే ఏవేవో తీసుకువచ్చారు. ఋణ శేషం వద్దనేమో' అన్నాడు సుందర్ నవ్వుతూ.

'అలా అని కాదు. మనకి ముందుగా మోనికా కేక్ ఇచ్చిన తర్వాతే కదా మనం వాళ్ళకి ఇచ్చింది. అదో పండగ మర్యాద అంతే. కానీ ఇంకోరకంగా చూస్తే నువ్వు చెప్పింది నిజమే. నేనూ జేమీ మారియో లంచ్ తింటానికి బయటికి వెళ్ళామనుకో. బిల్లు మొత్తం ముప్ఫై డాలర్లు అయిందనుకో. టిప్పుతో కలిపి తలా పన్నెండూ బల్ల మీద పడేస్తారు. అలా బిల్లు పంచుకోవటం సర్వ సహజం. నేనూ డగ్ ఇద్దరం వెడితే నేను బిల్లు ఇవ్వబోతే అతను వద్దు అంటాడు. నేను కాదూ కూడదూ అంటే 'సరేలే! ఈసారికి నువ్వు ఇవ్వు. వచ్చేసారి నేను ఇస్తాను' అంటాడు. అంతే కాదు వచ్చేసారి తనే ఇచ్చి 'పోయిన సారి నువ్విచ్చావుగా. ఈసారి నేనిస్తున్నాను' అంటాడు.

సుందర్ అన్నాడు 'మనమూ అలాగే చేస్తాంగా ఇండియాలో' అని.

'కాదని నేననలేదే.. అంతేకాదు. ఇరుగు పొరుగుల స్వంత విషయాల్లోకి పోరు. వాళ్ళ గురించీ వీళ్ళ గురించీ చెప్పుకోవటం కూడా అరుదు. అలాగే మిగతా వాళ్ళు వాళ్ళ వ్యక్తిగత విషయాల్లోకి రావటం వాళ్ళకీ ఇష్టం వుండదు. ఇక్కడ ఇళ్ళల్లో బయటనించీ రాగానే వుండేది ఫార్మల్ లివింగ్ రూం. ఏదన్నా అవసరం మీద మాట్లాడాలంటే వాళ్ళని అక్కడే కూర్చోబెట్టేది. అక్కడ టీవీలు స్టీరియోలు కూడా వుండవు. లోపల ఫామిలీ రూంలో వుంటాయి అవన్నీ. అది కుటుంబ సభ్యులకీ, ప్రాణ స్నేహితులకీ మాత్రమే పరిమితం.

అలా అని ఇంటి చుట్టుపక్కల ఏం జరుగుతున్నదో పట్టించుకోరనటానికీ వీలులేదు. మధ్యాహ్నం పూట, ఎన్నడూ చూడని మనుష్యులో, కారులో చుట్టుపక్కల తిరుగుతుంటే, ఇంట్లో వుండే ఆడవారు పోలీసులకి ఫోన్ చేసి అనుమానంగా వుందని రిపోర్ట్ చేయటం కూడా సర్వసామాన్యమే.

బయట కనపడ్డప్పుడు మనల్ని చిరునవ్వుతో పలకరించటం, ఏ ఆటల గురించో సినిమాల గురించో, టీవీ షోల గురించో మాట్లాడటం కూడా జరుగుతూనేవుంటుంది. కాకపోతే రెండే రెండు విషయాల మీద వాళ్ళు అసలు మాట్లాడరు. ఒకటి రాజకీయాలు. రెండు మతం. అందువల్ల అనవసరపు వాదనలకి అవకాశం వుండదు.

ఇదీ మా ఇరుగు పొరుగుల కథ.

0 0 0